

## అపాచీ ఆర్‌ఆర్ 310 ఎడిషన్


**ప్రారంభ ధర రూ.2.78 లక్షలు**

చెన్నై, ఏప్రిల్ 18: ద్విచక్ర వాహన సంస్థ టీవీ ఎస్...దేశీయ మార్కెట్‌కి సరికొత్త బైకును పరిచయం చేసింది. 2025 ఎడిషన్‌గా విడుదల చేసిన సూపర్ ప్రీమియం మోటర్‌సైకిల్ అపాచీ ఆర్ ఆర్310 మాడల్ రూ.2,77,999 ప్రారంభ ధరతో లభించనున్నది. దేశీయ మార్కెట్లోకి అపాచీ బ్రాండ్ అడుగుపెట్టి 20 ఏండ్లు పూర్తైన సందర్భంగా విడుదల చేసిన ఈ మాడను ప్రత్యేక ఎడిషన్‌గా అందుబాటులోకి తీసుకొచ్చినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటి వరకు దేశీయంగా 60 లక్షల కస్టమర్లు ఉన్నారు. 310 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో తయారైన ఈ మాడల్ 38 హెచ్‌పీ సామర్థ్యం ఇవ్వనున్నది.

## బొగ్గుపై రూ.20 సెస్ వసూలు

**'కోల్‌మైన్స్ పెన్షన్' స్కీమ్ కోసం సింగరేణి**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ) : కోల్‌మైన్స్ పెన్షన్ పథకం అమలు కోసం టన్ను బొగ్గుపై సెస్ రూపంలో రూ. 20 వసూలు చేయాలని సింగరేణి నిర్ణయించింది. సంస్థ ద్వారా విక్రయించే బొగ్గుపై సెస్ వసూలు చేసి కోల్‌మైన్స్ పెన్షన్ స్కీమ్‌లో జమచేయాలని శుక్రవారం జారీచేసిన సర్క్యులర్ పేర్కొంది. కోల్‌మైన్స్ పెన్షన్ స్కీం కింద ఇప్పటికే రూ.727 కోట్లకు పైగా నిధులుంటే డీహెచ్‌ఎఫ్‌ఎల్‌లో కోలిండియా పెట్టుబడి పెట్టింది. కానీ ఈ మొత్తం వెనక్కి తీసుకోలేదు. దాదాపు ఆ నిధులన్నీ దుర్వినియోగమైనట్టే. ఈ పరిస్థితుల్లో పెన్షన్ స్కీమ్‌ను కొనసాగించలేని కోలిండియా తరచూ హెచ్చరిస్తున్నది. 1998 కోల్‌మైన్స్ పెన్షన్ పథకం స్థిరపరిచేందుకు టన్ను బొగ్గుపై రూ. 20 సెస్‌గా వసూలు చేసి, పెన్షన్ పథకానికి జమచేయాలని కోలిండియా ఇటీవలే ఆదేశాలిచ్చింది. దీంతో సింగరేణి సంస్థ రూ. 20 సెస్ వసూలు చేయాలని తాజాగా సర్క్యులర్ జారీచేసింది. సీఎండీ ఎన్ బలరామ్‌కు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు దండంరాజు రామచందర్‌రావు ధన్యవాదాలు తెలిపారు. పెన్షన్ మొత్తం పెంచేందుకు కృషిచేయాలని కోరారు.



# యాప్‌లకు ఏఐ ఏజెంట్లు

**శరవేగంగా నియమించుకుంటున్న కంపెనీలు • 'గ్లోబర్ సీఆర్‌ఎం లీడర్ సేల్స్‌ఫోర్స్' నివేదికలో వెల్లడి**

**రానున్న రెండేండ్లలో ఆయా కంపెనీల్లో కోడ్ జనరేషన్‌కు 100 శాతం ఏఐ వినియోగం**

హైదరాబాద్, ఏప్రిల్ 18 (నమస్తే తెలంగాణ): ప్రస్తుతం టెక్నాలజీ రంగంలో కృత్రిమ మేధస్సు (ఏఐ) సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఏఐ ఏడాదిలోనే సాఫ్ట్‌వేర్ కోడ్‌లన్నింటినీ రాసేస్తుందని ఇప్పటికే పలువురు టెక్నాలజీ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మనుషులు అందిస్తున్న కొన్ని సేవలను 'ఏఐ ఏజెంట్లు'గా పిలిచే యంత్రాలే చేయనున్నాయి మరి. ఇక ఆయా యాప్‌లను ఏఐ ఏజెంట్లు అభివృద్ధి చేయనున్నట్టు తాజాగా 'గ్లోబల్ సీఆర్‌ఎం లీడర్ సేల్స్‌ఫోర్స్' తన నివేదికలో తెలిపింది. ఏఐతో ఉద్యోగ నియామకాల్లో సైతం భారీ మార్పులు వస్తాయని ఎక్స్‌పర్ట్స్ చెప్తున్న నేపథ్యంలో దేశంలోని ప్రతీ 10మంది సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసే లీడర్లలో 9మంది యాప్‌లను అభివృద్ధి చేసేందుకు సంప్రదాయ సాఫ్ట్‌వేర్ టూల్స్‌గా ఏఐ ఏజెంట్లు అవసరమని భావిస్తున్నట్టు రిపోర్టు వెల్లడించింది. దేశంలోని సాఫ్ట్‌వేర్లను అభివృద్ధి చేసే లీడర్లు.. ఏఐ ఏజెంట్లను వేగంగా నియమించుకుంటున్నట్టు రిపోర్టు వెల్లడించింది. రానున్న అభివృద్ధి యుగంలో ఏఐ యంత్రాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపింది.

**91 శాతం ఏఐ ఏజెంట్ల నియామకం..**

మన దేశంలోని 100మంది, ప్రపంచవ్యాప్తంగా ఉన్న 2 వేలమంది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లీడర్లు ఏజెంటిక్ ఏఐపై ఒకేలా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్టు ఈ నివేదిక వెల్లడించింది. సాఫ్ట్‌వేర్ల అభివృద్ధి భవిష్యత్తును రూపొందించడంలో ఏఐ సాధనాలు, ఏజెంట్ల ప్రాముఖ్యత పెరుగుతుండటం.. ఏఐ ఆధారిత అభివృద్ధివైపు స్పష్టమైన మార్పును సూచిస్తున్నట్టు అధ్యయనం తెలిపింది. భారత్‌లోని సాఫ్ట్‌వేర్ అభివృద్ధి లీడర్ల అభిప్రాయం ప్రకారం.. రానున్న రెండేండ్లలో 100 శాతం ఆయా కంపెనీల్లోని టీమ్‌లు కోడ్ జనరేషన్‌కు ఏఐని వినియోగించుకుంటాయని రిపోర్టు తెలిపింది. 91 శాతం కంపెనీల్లోని టీమ్‌లు ఏఐ ఏజెంట్లను నియమించుకుంటాయని వెల్లడించింది. ఏఐ ఏజెంట్లను నియమించుకునేందుకు ఆధునిక మౌలిక వసతులు, నైపుణ్యాలు, సామర్థ్యాలను పరీక్షించడం మరింత సవాలుగా మారనుందని 85 శాతం సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేసే లీడర్లు అభిప్రాయపడినట్టు రిపోర్టు తెలిపింది. అయితే ఇందులో 40 శాతం సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లీడర్లు తమ వద్ద ఏఐ ఏజెంట్లను నియమించుకోవడానికి పరీక్ష సామర్థ్య ప్రక్రియ పూర్తిగా లేదని అభిప్రాయపడినట్టు రిపోర్టు వెల్లడించింది.

### కీలకంగా మారనున్న 'ఏజెంటిక్ ఏఐ'

మనిషి జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేకుండా, స్వతంత్రంగా నిర్దిష్ట పనులను పూర్తి చేసేందుకు ఉపయోగపడే ఏఐ సిస్టమ్‌లను 'అటానమస్ ఏజెంట్లు'గా వ్యవహరిస్తారు. వివిధ పనులు, ప్రక్రియలను ఆటోమేట్ చేసేందుకు వీటిని వినియోగించుకునే విధానాన్ని ఏజెంటిక్ ఏఐగా పరిగణిస్తారు. అయితే డెవలపర్లు కోడ్ రాయడం, డీబగ్గింగ్ వంటి సాధారణ పనుల నుంచి మరింత వ్యూహాత్మకంగా, ప్రభావవంతంగా 'ఏజెంటిక్ ఏఐ' చొరవ చూపనున్నట్టు రిపోర్టు చెప్పింది. డెవలపర్లు లో-కోడ్, నో-కోడ్ సాధనాలతో నడిచే ఏజెంట్లను ఎక్కువగా ఉపయోగిస్తుండగా.. డెవలపర్ల కోడింగ్ సామర్థ్యాలతో సంబంధం లేకుండా.. అభివృద్ధి వేగంగా, సులభంగా, సమర్థవంతంగా మారనుంది. 'భారత్‌లో 92 శాతం మంది సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ లీడర్లు ఏజెంటిక్ ఏఐ తప్పనిసరి అని చెప్పడంతో రానున్న రోజుల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 'భవిష్యత్తులో డెవలపర్లను కేవలం కోడర్లుగా చూడొద్దు అనే దిశగా మనం ముందుకు సాగుతున్నాం. తెలివైన వ్యవస్థలను ఏర్పరిచే ఏజెంట్ ఆధారిత ఆర్కిటెక్చర్లకు ఆవిష్కరణలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి.' అని సేల్స్‌ఫోర్స్-సౌత్ ఆసియా ఈవీపీ అండ్ ఎండీ అరుణ్ పరమేశ్వరన్ తెలిపారు.

## 4 రోజులు..26 లక్షల కోట్లు

**స్టాక్ మార్కెట్ల ర్యాలీతో పెరిగిన మదుపరుల సంపద**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: ప్రతీకార సుంకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతోపాటు విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా నిధులను చొప్పించడంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు కదంతొక్కాయి. గడిచిన నాలుగు సెషన్లలో ఏకంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు ఆరు శాతం వరకు లాభపడ్డాయి. వీటికితోడు ఈ ఏడాది సాధారణ స్థాయి కంటే అధికంగా వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ అంచనా మదుపరుల్లో సెంటిమెంట్‌ను మెరుగుపరిచింది. ద్రవ్యోల్బణం ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో వచ్చే సమీక్షలో రిజర్వుబ్యాంక్ వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలుండటం కూడా సూచీల్లో జోష్ పెంచింది. ఫలితంగా గత నాలుగు సెషన్లలో బీఎస్ఈ సెన్సెక్స్ 4,706.05 పాయింట్లు లేదా 6.37 శాతం లాభపడగా, నిఫ్టీ 1,452.5 పాయింట్లు లేదా 6.48 శాతం చొప్పున ఎగబాకాయి. దీంతో మదుపరుల సంపద రూ.25.77 లక్షల కోట్లు ఎగబాకి రూ.4,19,60,046.14 కోట్ల(4.90 ట్రిలియన్ డాలర్లు)కి చేరుకున్నది. గత మూడు సెషన్లలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు దేశీయ ఈక్విటీ మార్కెట్లలో బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా శుక్రవారం స్టాక్ మార్కెట్లు సెలవు పాటించాయి.



# పసిడి దిగుమతులు హైజంప్

**ధర పెరిగినప్పటికీ మార్చి నెలలో 192 శాతం జంప్**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: బంగారం దిగుమతులు రికార్డు స్థాయిలో దూసుకుపోయాయి. ఒకవైపు ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ దిగుమతులు మాత్రం తగ్గడం లేదు. గత నెలలో భారత్‌లోకి 4.47 బిలియన్ డాలర్ల విలువైన పుత్తడి దిగుమతి అయింది. క్రితం ఏడాది ఇదే నెలలో దిగుమతైన దాంతో పోలిస్తే 192 శాతం అధికమని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ పెట్టుబడిదారుల్లో నమ్మకం సడలలేదన్నడానికి ఈ దిగుమతులే నిదర్శణమని పేర్కొంది. అమెరికా-చైనా దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడం, బ్యాంకుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటం, ధరలు రికార్డు స్థాయిలో పెరిగినప్పటికీ కొనుగోళ్లు తగ్గడం లేదని వెల్లడించింది. ఇదే క్రమంలో గురువారం బంగారం ధర రికార్డు స్థాయి రూ.98,170 పలికిన విషయం తెలిసిందే. అలాగే గడిచిన ఆర్థిక సంవత్సరం(2024-25, ఏప్రిల్ నుంచి మార్చి మధ్యకాలంలో) పసిడి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 27.27 శాతం ఎగబాకి 58 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 2023-24లో ఇది 45.54 బిలియన్ డాలర్లు ఉన్నాయి. వెండి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. డాలర్ బలహీనపడటం, వాణిజ్య యుద్ధ భయాలు మరింత ముదురుతుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల విధింపుతో అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితికి గురవుతున్న ప్రస్తుత తరుణంలో అతి విలువైన లోహాలు ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. స్విట్జర్లాండ్ నుంచి భారత్ అత్యధికంగా పసిడి దిగుమతి చేసుకుంటున్నది. మొత్తం దిగుమతుల్లో 40 శాతం స్విట్జర్లాండ్ నుంచి వస్తుండగా, యూఏఈ నుంచి 16 శాతం, దక్షిణాఫ్రికా నుంచి 10 శాతం చొప్పున దిగుమతి అవుతున్నాయి. 2023-24లో 795.32 టన్నుల బంగారం దిగుమతి కాగా, 2024-25లో 757.15 టన్నులకు పడిపోయింది.



**తగ్గిన వెండి దిగుమతులు**

వెండి దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. మార్చి నెలలో వెండి దిగుమతులు ఏడాది ప్రాతిపదికన 85.4 శాతం తగ్గి 119.3 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. 2024-25లో వెండి దిగుమతులు 11.24 శాతం తగ్గి 4.82 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కిలో వెండి ధర రూ.1,400 తగ్గి రూ.98 వేలకు పరిమితమైంది.

**వాణిజ్య లోటు మరింత పైకి..**

బంగారం భారీగా దిగుమతి కావడంతో మళ్లీ వాణిజ్యలోటు రికార్డు స్థాయికి చేరుకున్నది. గత నెలలో వాణిజ్య లోటు 21.54 బిలియన్ డాలర్లుగా నమోదవగా, గడిచిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి 282.82 బిలియన్ డాలర్లుగా ఉన్నది. చైనా తర్వాత అత్యధికంగా వినియోగిస్తున్న భారత్‌లో ఆభరణాలకు డిమాండ్ అధికంగా ఉన్నదని, ముఖ్యంగా పెళ్లిళ్ల సీజన్‌లో ఇది అధికంగా ఉంటుందని ఆభరణాల వర్తకులు పేర్కొన్నారు.

## 2 వేలకు పైగా యూపీఏ లావాదేవీలపై జీఎస్టీ విధించం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: రూ.2 వేల కంటే అధికంగా జరిపే యూపీఐ లావాదేవీలపై జీఎస్టీ విధించే ప్రతిపాదనేది తమ వద్దలేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టంచేసింది. రెండు వేల రూపాయల కంటే అధిక లావాదేవీలపై జీఎస్టీ విధిస్తారని వస్తున్న వార్తను ఖండించిన ఆర్థిక మంత్రిత్వ శాఖ.. ఈ వార్తలు అబద్ధమని, తప్పుదారి పట్టించేది, ఎటువంటి ఆధారం లేనవని తెలిపింది. ప్రసుత్తం ఇలాంటి ప్రతిపాదనేది ప్రభుత్వం వద్ద లేదని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు వెల్లడించాయి. యూపీఐ లావాదేవీలు భారీగా పెరుగుతున్నాయని, 2019-20లో రూ.21.3 లక్షల కోట్లుగా ఉన్న లావాదేవీలు..మార్చి 2025 నాటికి రూ.260.56 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ప్రభుత్వం డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నదని పేర్కొన్నారు.





చిత్రం

## గోపీచంద్‌తో సినిమా కన్‌ఫర్మ్



అగ్ర నటుడు బాలకృష్ణ కొత్త సినిమా విషయంలో స్పష్టత వచ్చింది. ప్రస్తుతం ఆయన 'అఖండ-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. తొలిభాగం బ్లాక్‌బస్టర్ హిట్ దృష్ట్యా ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా పూర్తయిన తర్వాత బాలయ్య తదుపరి ప్రాజెక్ట్ ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. తనకు 'వీరసింహారెడ్డి' వంటి హిట్ చిత్రాన్ని అందించిన గోపీచంద్ మలినేనితో బాలకృష్ణ మరో సినిమాకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని ప్రచారం జరుగుతున్నది. తాజాగా ఈ విషయాన్ని దర్శకుడు గోపీచంద్ కన్‌ఫర్మ్ చేశారు. ఓ జాతీయ వెబ్‌సైట్‌తో ముచ్చటించిన ఆయన.. తన తదుపరి సినిమాను బాలకృష్ణతో చేయబోతున్నానని వెల్లడించారు. బాలకృష్ణ జన్మదినమైన జూన్ 10న ఈ సినిమా మొదలవుతుందని తెలిపారు. ఇటీవల 'జాట్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో పెద్ద విజయాన్ని సొంతం చేసుకున్నారు దర్శకుడు గోపీచంద్ మలినేని. దీనికి సీక్వెల్‌ను తెరకెక్కించబోతున్నట్లు నిర్మాణ సంస్థ ఇటీవలే వెల్లడించింది. అయితే బాలకృష్ణతో సినిమా పూర్తిచేశాకే దర్శకుడు గోపీచంద్ 'జాట్-2' షూట్‌లోకి ఎంటరవుతారని తాజా సమాచారం.



## ఆ రియాక్షన్‌కి షాకయ్యా

'ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. విజయశాంతిగారితో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నా. తల్లీకొడుకుల బాండింగ్ ఆడియన్స్‌ని బాగా ఆకట్టుకుంది. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి క్రాఫ్ట్‌ని ప్రేక్షకులు పొగుడుతున్నారు. ముఖ్యంగా క్లైమాక్స్ ఈ సినిమాకు హైలైట్. మా అబ్బాయి సినిమా చూసి ఇలాంటి సీక్వెన్స్ ఇండియన్ స్క్రీన్‌పై చూడలేదన్నాడు. ఆ రియాక్షన్‌కి నేను షాక్ అయ్యాను. ఏదేమైనా ఈ క్రెడిట్ అంతా దర్శకుడు ప్రదీప్‌దే' అని హీరో కల్యాణ్‌రామ్ పేర్కొన్నారు. ఆయన హీరోగా ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. విజయశాంతి కీలక పాత్ర పోషించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సక్సెస్ ప్రెస్‌మీట్‌లో కల్యాణ్‌రామ్ మాట్లాడారు. 'నిర్మాణంలో ఉన్నప్పుడే ఈ సినిమా సూపర్‌హిట్ అవుతుందని నమ్మాం. ఆ నమ్మకం నిజమైంది' అని నటుడు శ్రీకాంత్ అన్నారు. ప్రేక్షకులకూ, ఈ సినిమాకు పనిచేసిన వారందరికీ దర్శక, నిర్మాతలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కమల్ రాసిన పెళ్లిపాట



37ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కమల్‌హాసన్, మణిరత్నం కలిసి పనిచేస్తున్న చిత్రం 'థగ్ లైఫ్'. శింబు, త్రిష కృష్ణన్, ఐశ్వర్యలక్ష్మి, అభిరామి కీలక పాత్రధారులు. ఈ భారీ పానిండియా చిత్రం జూన్ 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. చెన్నైలో ఓ భారీ ఈవెంట్‌ని నిర్వహించి ఈ సినిమాలోని తొలి పాటను విడుదల చేశారు. ఈ వేడుకలో కమల్‌హాసన్, మణిరత్నం, ఏ.ఆర్.రెహమాన్, త్రిష సందడి చేశారు. పెళ్లి వేడుక నేపథ్యంలో 'జింగుచా..' అంటూ మొదలయ్యే ఈ పాటను కమల్‌హాసన్ స్వయంగా రాయడం విశేషం. ఏ.ఆర్.రెహమాన్ స్వరపరిచిన ఈ గీతాన్ని వైశాలీ సమంత్, శక్తిశ్రీ గోపాలన్, ఆదిత్య ఆర్.కె కలిసి ఆలపించారు. కమల్‌హాసన్‌తో పాటు శింబు, త్రిష, సానియా మల్హోత్రా, నాజర్, తనికెళ్ల భరణి ఈ పాటలో ఆడిపాడారు. పెళ్లి వేడుకలో భాగంగా ఈ పాటను చిత్రీకరించినట్టు పాటను చూస్తే అర్థమవుతున్నది. శ్రేష్ఠ్ మూవీస్ ద్వారా తెలుగులో ఈ సినిమా విడుదల కానుంది. వచ్చే నెల 23న ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ ఈవెంట్‌ని నిర్వహించనున్నామనీ, ఈ ఈవెంట్‌లో ఏ.ఆర్.రెహమాన్ ప్రదర్శన ఇవ్వనున్నారని మేకర్స్ తెలిపారు.



## దూరదర్శని కలిపింది ఇద్దరిని

సువిక్షిత్, గీతిక రతన్ జంటగా నటిస్తున్న చిత్రం 'దూరదర్శని'. 'కలిపింది ఇద్దరిని' ఉపశీర్షిక. కార్తికేయ కొమ్మి దర్శకుడు బి.సాయిప్రతాప్‌రెడ్డి, జయశంకర్ రెడ్డి నిర్మాతలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ సినిమా నుంచి 'అపన్నా తనా మనా' అనే లిరికల్ వీడియోను ప్రముఖ దర్శకుడు సుకుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. హీరో సువిక్షిత్ గొప్ప పాషన్‌తో నటించారని మెచ్చుకున్నారు. 1990 నేపథ్యంలో జరిగే ప్రేమకథ ఇదని, ప్రతి ఒక్కరిని ఆ కాలంలోకి తీసుకెళ్తుందని, బ్యాక్‌డ్రాప్‌కు తగిన లొకేషన్లలో సహజంగా తెరకెక్కించామని, తన అభిమాన దర్శకుడు సుకుమార్ ఈ పాటను విడుదల చేయడం ఆనందంగా ఉందని హీరో సువిక్షిత్ అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఆనంద్ గుర్రాన, దర్శకుడు: కార్తికేయ కొమ్మి.



## పాపం.. పూర్తిగా భ్రమలో ఉంది!

ఓ ఇంటర్వ్యూలో చిత్రంగా మాట్లాడి నెటిజన్లకు టార్గెట్‌గా మారింది బాలీవుడ్ నటి ఊర్వశీ రౌతేలా. తన తాజా ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ 'ఉత్తరాఖండ్‌లో నా పేరిట ఓ ఆలయం ఉంది తెలుసా? ఎవరైనా బద్రీనాథ్ వెళితే.. పక్కనే ఉన్న నా ఆలయాన్ని కూడా సందర్శించండి' అని చెప్పింది. ఇంకా మాట్లాడుతూ 'దిల్లీ విశ్వవిద్యాలయంలోనూ నా ఫొటోకు పూలమాల వేసి నన్ను 'దండమమాయి' అని పిలుస్తుంటారు తెలుసా? ఈ విషయంపై పలు వార్తా పత్రికల్లో కథనాలు కూడా వెలువడ్డాయి. కావాలంటే నెట్‌లో చూడండి' అంటూ చెప్పుకొచ్చింది ఊర్వశీ. అంతటితో ఆగకుండా.. 'దక్షిణాదిలో చిరంజీవి, బాలకృష్ణ, పవన్‌కల్యాణ్ వంటి టాప్‌స్టార్స్‌తో నటించా. అక్కడ కూడా నాకెంతో మంది అభిమానులున్నారు. దక్షిణాదిలోనూ నాకు రెండో ఆలయాన్ని నిర్మించాలని ఆశిస్తున్నా' అని చెప్పింది ఊర్వశి. ఈ పైత్యమంతా వింటున్న సదరు యాంకర్.. 'మీ గుడికి వచ్చిన వారికి మీ ఆశీర్వాదం ఉంటుందా? అని అడగ్గా.. 'అన్ని ఆలయాల్లో ఏం జరుగుతాయో.. అక్కడా అవే జరుగుతాయ్..' అని సమాధానమిచ్చింది ఊర్వశీ రౌతేలా. ఈ ఇంటర్వ్యూ చూసిన నెటిజన్లంతా 'పాపం.. ఈమె పూర్తిగా భ్రమలో ఉండిపోయింది..' అంటూ కామెంట్లతో ఆటపట్టిస్తున్నారు.

**మానసిక దివ్యాంగులే**

## నా సినిమా హీరోలు!



అమీర్ ఖాన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన 'తారే జమీన్ పర్' (2007) చిత్రం స్ఫూర్తివంతమైన కథాంశంతో ప్రేక్షకుల్ని మెప్పించింది. బాల్యంలో తలెత్తే డిస్లెక్సియా (చదవడం, అభ్యాసం తాలూకు వైకల్యం) అనే మానసిక రుగ్మత గురించి ఈ సినిమాలో చర్చించారు. 'తారే జమీన్ పర్' బాక్సాఫీస్ వద్ద విజయం సాధించడంతో పాటు దేశవ్యాప్తంగా అందరి ప్రశంసలందుకుంది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'సితారే జమీన్ పర్' జూన్ 20న విడుదలకు సిద్ధమవుతున్నది. ఆర్.ఎస్.ప్రసన్న దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అమీర్ ఖాన్, జెనీలియా ప్రధాన పాత్రధారులు. స్పానిష్ చిత్రం 'ఛాంపియన్స్' ఆధారంగా తెరకెక్కించారు. మానసిక దివ్యాంగులతో కూడిన బాస్కెట్ బాల్ బృందం వరుసగా 12సార్లు జాతీయ ఛాంపియన్‌గా నిలవడమే ఈ చిత్ర ఇతివృత్తం. తాజా ఇంటర్వ్యూలో అమీర్‌ఖాన్ ఈ సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. విధివంచితుల జీవితాల్లో ఆశల్ని చిగురింపజేసేలా ఈ సినిమా ఉంటుందని తెలిపారు. 'ఇందులో మొత్తం పదిమంది హీరోలుంటారు. వారిలో కొందరు ఆటిజమ్ సమస్యతో, మరికొందరు వివిధ మానసిక వైకల్యాలతో బాధపడుతుంటారు. మానసిక దివ్యాంగులైన నటులతో పాటు వివిధ వైకల్యాలతో సతమతమవుతున్న వ్యక్తులు ఈ సినిమాలో నటించారు. వారి సహజమైన నటన హృదయాల్ని కదిలిస్తుంది' అని చెప్పారు.

## పానిండియా స్థాయిలో 'దృశ్యం 3'



మలయాళంలో 'దృశ్యం' ఫ్రాంచైజీ ఓ సంచలనం. ఇప్పటివరకూ ఈ ఫ్రాంచైజీలో రెండు సినిమాలొచ్చాయి. ఈ ఫ్రాంచైజీ ఇతర భాషల్లోనూ రీమేక్ అయ్యి.. ప్రతి భాషలోనూ భారీ విజయాలను అందుకుంది. ఆ విధంగా దేశవ్యాప్తంగా 'దృశ్యం ఫ్రాంచైజీ' ఓ సెన్సేషన్. ఏదేమైనా ఈ క్రెడిట్ పూర్తిగా మాతృకల దర్శకుడైన జీతూ జోసఫ్‌కే దక్కుతుంది. ప్రస్తుతం జీతూ 'దృశ్యం 3' తెరకెక్కించే పనిలో ఉన్నారు. ఈ సినిమా కూడా ఇతర భాషల్లో రీమేక్ అవ్వడం ఖాయం అని అందరూ అనుకుంటున్న తరుణంలో.. 'దృశ్యం 3'ని రీమేక్ చేయాలని చూస్తున్న ఇతర భాషలకు చెందిన మేకర్లందరి ఉత్సాహానికీ హీరో మోహన్‌లాల్ అడ్డుకట్ట వేశారు. మలయాళంలో రూపొందుతున్న 'దృశ్యం 3' ఈ దఫా పానిండియా స్థాయిలో విడుదల కానుంది. అన్ని భాషల్లోనూ ఇక హీరో మోహన్‌లాలే. దర్శకుడు జీతూ జోసఫ్పే. మలయాళంలో వందకోట్లు, హిందీలో రెండొందల కోట్లు, ఇతర భాషలన్నీ కలిసి ఓ రెండొందల కోట్లు.. ఇలా రమారమీ ఓ అయిదొందల కోట్లకు టార్గెట్ పెట్టారు హీరో మోహన్‌లాల్.

## నిజమైన హంతకుడు ఎవరు?





నవీన్‌చంద్ర హీరోగా నటిస్తున్న చిత్రం 'బ్లైండ్ స్పాట్'. రాకేష్‌వర్మ దర్శకుడు. మ్యాంగో మీడియా పతాకంపై రామకృష్ణ వీరపనేని నిర్మించారు. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఓ హత్య విషయంలో పోలీస్ పరిశోధన నేపథ్యంలో ట్రైలర్ ఉత్కంఠగా సాగింది. నిజమైన హంతకుడు ఎవరు? అనే ఉత్సుకతను పెంచింది. నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'సీట్‌ఎడ్జ్ థ్రిల్లర్ ఇది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది. ఇలాంటి పాత్ర చేయడం ఛాలెంజింగ్‌గా అనిపించింది' అన్నారు. రోటీన్ మర్డర్ మిస్టరీ కథలకు భిన్నంగా ఈ సినిమాను తెరకెక్కించామని, ప్రేక్షకులకు ఆద్యంతం ఉత్కంఠకు గురిచేస్తుందని దర్శకుడు రాకేష్ తెలిపారు. రాశీసింగ్, అలీరెజా, రవివర్మ, గాయత్రి భార్గవి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీరామ్ మద్దూరి, రచన-దర్శకత్వం: రాకేష్‌వర్మ.



## వినోదాన్ని పంచే శుభం

ప్రముఖ నటి సమంత నిర్మాతగా తీసిన చిత్రం 'శుభం'. ప్రవీణ్ కాండ్రేగుల దర్శకుడు. హర్షిత్‌రెడ్డి, శ్రీయా కొంతం, గవిరెడ్డి శ్రీనివాస్ ఇందులో ప్రధాన పాత్రధారులు. మే 9న విడుదల చేయనున్నట్టు శుక్రవారం ఓ ప్రకటన ద్వారా మేకర్స్ తెలియజేశారు. సెన్సిబుల్ హ్యూమర్‌తో ఈ సినిమా అందర్నీ పాత కాలానికి తీసుకెళ్తుందని, ఫ్యామిలీ మొత్తం చూడదగ్గ సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. సమంత మాట్లాడుతూ 'వినోదాన్ని అందించడమే లక్ష్యంగా మా ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ ముందుకెళ్తుంది. ఆ కోవలో మేం చేసిన తొలి ప్రయత్నమే 'శుభం'' అన్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.